## క్లుప్తంగా

### మాస్ కాపీయింగ్‌ను అరికట్టాలి

కర్నూలు(సెంట్రల్): ఓపెన్ టెన్త్, ఇంటర్ అడ్వాన్సుడు సప్లిమెంటరీ పరీక్షల్లో మాస్ కాపీయింగ్‌ను అరికట్టాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు శనివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో పనిచేసే కొందరు అధికారులు ఓపెన్ టెన్త్, ఇంటర్ సెంటర్ల నిర్వాహకులతో కుమ్మక్కై మాస్ కాపీయింగ్‌కు అవకాశం ఇస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయన్నారు. దీనిపై సమగ్ర విచారణ చేపట్టాలని కోరారు.

### సంపత్ హత్యపై విచారణ జరపాలి

కర్నూలు(సెంట్రల్): ఎన్‌ఎస్‌యూఐ జాతీయ కో ఆర్డినేటర్ సంపత్‌కుమార్ హత్యపై సమగ్ర విచారణ చేపట్టాలని డీసీసీ ఉపాధ్యక్షుడు వెంకటరెడ్డి, పీసీసీ అధికార ప్రతినిధి రామాంజనేయులు, ముస్లిం మైనార్టీ విభాగం ప్రధాన కార్యదర్శి ఖాద్రీపాషా శనివారం వేర్వేరు ప్రకటనల్లో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సత్యసాయి జిల్లా హిందూపూర్‌కు చెందిన సంపత్‌కుమార్‌ను వారం రోజుల క్రితం హత్య చేశారన్నారు. అయితే ఇంతవరకు ఎవరు హత్య చేశారో పోలీసుల విచారణలో తేలలేదన్నారు. హిందూపూర్‌లో ఆరాచకం రాజ్యమేలుతోందని, శాంతిభద్రతలను కాపాడాల్సిన బాధ్యతపై ప్రభుత్వం ఉందన్నారు.

### కార్మికుల కడుపు కొట్టొద్దు



మాట్లాడుతున్న బి.బతుకన్న

కర్నూలు(సెంట్రల్): కర్నూలు మునిసిపల్ కార్పొరేషన్‌లో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులను తీసి వేసి వారి కడుపు కొట్టొద్దని ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు బి.బతుకన్న కోరారు. శనివారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఒకవైపు కర్నూలు మునిసిపల్ కార్పొరేషన్ విస్తరించుకుంటూ పోతుంటే.. కార్మికుల సంఖ్యను పెంచాల్సింది పోయి.. కొంతమందిని తీసివేసేలా నిర్ణయం తీసుకోవడం భావ్యం కాదన్నారు. ఇప్పటికే ఉన్న సిబ్బంది కాలువల్లో పూడిక తీయలేక, రోడ్లను శుభ్రం చేయలేకపోతున్నారన్నారు.

### 90శాతం సబ్సిడీతో ఎరువులు అందించాలి

కల్లూరు: ఖరీఫ్ సాగుకు సంబంధించి అన్నిరకాల విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు 90 శాతం సబ్సిడీతో రైతులకు అందించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం మండల కార్యదర్శి కృష్ణ కోరారు. ఈ మేరకు శనివారం మండల వ్యవసాయ అధికారి కార్యాలయంలో ఏఓ శ్రీనివాసరెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నకిలీ విత్తనాలు, ఎరువులు అమ్ముతున్న డీలర్లపై కఠినమైన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి కె.మధు, రైతులు భాస్కర్‌రెడ్డి, హరిబాబు, శీను తదితరులు పాల్గొన్నారు.

### ఎండలో తిరగరాదు

● డీఎంహెచ్‌ఓ డాక్టర్ ప్రవీణ్‌కుమార్


ఓఆర్‌ఎస్ వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న డీఎంహెచ్‌ఓ

కల్లూరు: అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని, ప్రజలు ఎండలో బయట తిరగరాదని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి (డీఎంహెచ్‌ఓ ) డాక్టర్ ప్రవీణ్‌కుమార్ సూచించారు. శనివారం కల్లూరు మండలం పర్ల గ్రామంలో జరగుతున్న ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ.. ఎండలు పెరిగిన నేపథ్యంలో వడదెబ్బకు గురయ్యే అవకాశం ఉందన్నారు. నీరసంగా అనిపిస్తే ఓఆర్‌ఎస్ నీరు తరచుగా తాగాలన్నారు. ఓఆర్‌ఎస్ పొడి అందుబాటులో లేకుంటే ఒక లీటర్ నీటికి 4 స్పూన్ల చెక్కర, ఒక టీ స్పూన్ ఉప్పును కలిపిన ద్రావణాన్ని తయారు చేసి తాగించాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

### వ్యవసాయ మార్కెట్ కమిటీ ధరలు

| పంట | తక్కువ ధర (రూపాయల్లో) | ఎక్కువ ధర (రూపాయల్లో) |
|---|---|---|
| వేరుశనగ | 4,689 | 6,510 |
| పొద్దుతిరుగుడు | 2,829 | 2,829 |
| ఆముదం | 5,190 | 5,309 |
| వాము | 740 | 26,040 |
| ఉల్లి | 966 | 1,617 |
| ఎండుమిర్చి | 3,699 | 14,599 |
| శనగలు | 6,496 | 6,850 |
| కందులు | 6,496 | 12,191 |
| మొక్కజొన్న | 2,289 | 2,289 |
| మినుములు | 9,401 | 9,401 |
| కొర్రలు | 4,359 | 4,559 |
| సోయాచిక్కుడు | 3,970 | 3,970 |

# జై.. హనుమాన్

● భక్తిశ్రద్ధలతో హనుమజ్జయంతి
● ఆలయాల్లో ప్రత్యేక పూజలు


సూర్యనారాయణ స్వామి ఆలయంలో ఆంజనేయస్వామి


సత్యనారాయణ స్వామి ఆలయంలో సీతారామ ఆంజనేయస్వామి


బళ్లారి చౌరస్తా అభయాంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక అలంకారంలో స్వామివారు


దూపాడు సమీపంలోని ఆలయంలో ప్రత్యేక అలంకారంలో స్వామివారు


మాధవ నగర్ సీతారామాలయంలో..


జగన్నాథ గట్టుపై అభయాంజనేయ స్వామికి పూజలు చేస్తున్న భక్తులు


జగన్నాథ గట్టు ఆలయంలో ప్రత్యేక అలంకారంలో సీతారామలక్ష్మణులు


సూర్యదేవాలయంలో ఆంజనేయుని విగ్రహానికి పాలాభిషేకం చేస్తున్న పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి దంపతులు


పూజల్లో పాల్గొన్న భక్తులు


సూర్యదేవాలయంలో ఆంజనేయునికి పూజలు చేస్తున్న భక్తులు

కర్నూలు కల్చరల్: కర్నూలు నగరంలోని సీతారామ, అభయాంజనేయ స్వామి ఆలయాల్లో శనివారం హనుమజ్జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. స్వామి వారికి పంచామృతాభిషేకాలు, ఆకుపూజ, వడమాల సమర్పణ, హనుమాన్ చాలీసా పారాయణ, సుందరకాండ పారాయణం, ధార్మిక ప్రవచన కార్యక్రమాలు నిర్వహించారు.

- కర్నూలు సూర్యనారాయణ స్వామి ఆలయంలో వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, ఆయన సతీమణి కాటసాని ఉమా మహేశ్వరమ్మ పూజల్లో పాల్గొన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రిగా, ఎమ్మెల్యే కాటసాని మరోసారి భారీ మెజారిటీతో ఎన్నికల్లో గెలవాలని పూజలు నిర్వహించినట్లు వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవపూజ ధనుంజయ్య ఆచారి తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు దండు లక్ష్మీకాంతారెడ్డి, నాయకులు బాలచంద్రారెడ్డి, బత్తుల లక్ష్మీకాంతయ్య, యూనుస్ బాషా, శివారెడ్డి, సత్యం యాదవ్, ఆలయం మేనేజింగ్ ట్రస్టీ శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.
- నగర బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో సంకల్‌బాగ్‌లోని హరిహర క్షేత్రంలో హనుమజ్జయంతిని వైభవంగా నిర్వహించారు. సంఘం నాయకులు మనోహర్, రాజశేఖర్, చంద్రశేఖర్ శర్మ, తదితరులు పాల్గొన్నారు.
- జగన్నాథ గట్టు అభయాంజనేయస్వామి విగ్రహం వద్ద జరిగిన పూజల్లో కార్తీక దీపోత్సవ కమిటీ అధ్యక్షురాలు పద్మావతి, మల్లికార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.
- నగరంలోని బళ్లారి చౌరస్తా అభయాంజనేయ స్వామి ఆలయం, లలితా పీఠం, సత్యసాయి మందిరం, కోట ఆంజనేయ స్వామి ఆలయం, ఆరోరా నగర్ రాజరాజేశ్వరి దేవి ఆలయం, అశోక్‌నగర్ ప్రసన్నాంజనేయ ద్వారకా సాయినాథ ఆలయం, బుధవార పేట ఈశ్వర ఆంజనేయ స్వామి ఆలయం, మాధవ నగర్ సీతారామాంజనేయస్వామి ఆలయంలో ఘనంగా హనుమజ్జయంతిని నిర్వహించారు.

## గోశాలలో హనుమజ్జయంతి

కర్నూలు కల్చరల్: శ్రీ సీతారామ కల్యాణ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో గోశాలలో హనుమజ్జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. శనివారం గోశాలలో జరిగిన వేడుకల్లో గోపూజ, ఆధ్యాత్మిక సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. స్వామివారికి అభిషేకం, సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. ఉత్సవ మూర్తులకు పల్లకీ సేవ జరిగింది. కార్యక్రమంలో ఉత్సవ సమితి అధ్యక్షుడు క్రిష్టన్న, గౌరవాధ్యక్షుడు డాక్టర్ మోక్షేశ్వరుడు, సభ్యులు దామోదర్‌రెడ్డి, మహాబలేష్, మురళి, నాగోజీరావు తదితరులు పాల్గొన్నారు.


సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం చేస్తున్న భక్తులు


గోశాలలో అభయాంజనేయ స్వామికి పూజలు చేస్తున్న అర్చకులు

## 4న ఆర్‌యూ పరిసరాల్లో ట్రాఫిక్ మళ్లింపు


ట్రాఫిక్ మళ్లింపునకు సంబంధించి జాతీయ రహదారిని పరిశీలిస్తున్న ఎస్పీ కృష్ణకాంత్

కర్నూలు: సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపును పురస్కరించుకుని రాయలసీమ యూనివర్సిటీ పరిసర ప్రాంతాల్లో జూన్ 4వ తేదీ ట్రాఫిక్ మళ్లింపు ఉంటుందని, సహకరించాలని జిల్లా ప్రజలకు ఎస్పీ కృష్ణకాంత్ సూచించారు. ఓట్ల లెక్కింపు కట్టుదిట్టమైన భద్రత మధ్య, సీసీ కెమెరాల నిఘా నీడలో జరుగుతుందని తెలిపారు. శనివారం ట్రాఫిక్ మళ్లింపు ఏర్పాట్లను క్షేత్రస్థాయి అధికారులతో కలిసి జాతీయ రహదారులను పరిశీలించారు. ట్రాఫిక్ మళ్లింపును దృష్టిలో పెట్టుకుని వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాల్లో గమ్యస్థానాలు చేరుకోవాలని సూచించారు. నంద్యాల చెక్‌పోస్టు నుంచి రాయలసీమ యూనివర్సిటీ వెళ్లే మార్గంలో కేవలం 8 అసెంబ్లీ నియోజకవర్గాలు, పార్లమెంటు నియోజకవర్గ ఎన్నికల లెక్కింపు విధుల్లో పాల్గొనే సిబ్బంది, సంబంధిత అధికారులు, నియోజకవర్గ అభ్యర్థులు, వారి ఏజెంట్ల వాహనాలు మాత్రమే అనుమతి ఉంటుందని చెప్పారు. జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కాలేజ్, దిన్నెదేవరపాడు, బి.తాండ్రపాడు, పసుపుల రోడ్డు వైపు వెళ్లే ఇతర వాహనాలకు ఆ మార్గం గుండా వెళ్లేందుకు అనుమతి లేదన్నారు. నంద్యాల చెక్‌పోస్టు నుంచి బి.తాండ్రపాడు, నన్నూరు టోల్‌ప్లాజా, నంద్యాల వైపు వెళ్లే వాహనాలు బద్రినాథ్ నగర్, మారుతి మెగాసిటీ, శిల్పాటౌన్‌షిప్‌లకు సంబంధించిన కాలనీ వాసులు యూనివర్సిటీ మెయిన్ రోడ్డులో కాకుండా దిన్నెదేవరపాడు, మిలిటరీ క్యాంటీన్, బిర్లా జంక్షన్ మీదుగా వెళ్లేలా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. అలాగే నంద్యాల వైపు నుంచి కర్నూలు నగరంలోకి వచ్చే ఆర్టీసీ బస్సులు, ఇతర వాహనాలు నన్నూరు టోల్ గేట్, ఔటర్ రింగ్ రోడ్డు, గుత్తి పెట్రోల్ బంకు, చెన్నమ్మ సర్కిల్, బళ్లారి చౌరస్తా మీదుగా ఆర్టీసీ బస్టాండ్‌కు చేరుకోవాల్సి ఉంటుందన్నారు. హైదరాబాదు వైపు నుంచి కర్నూలులోకి వచ్చే వాహనాలు, నందికొట్కూరు, ఆత్మకూరు, శ్రీశైలం, విజయవాడ నుంచి కర్నూలు వైపు వచ్చే అన్ని రకాల వాహనాలు, డోన్ నుంచి కర్నూలులోకి వచ్చే అన్ని రకాల వాహనాలు యథావిధిగా వెళ్లవచ్చని తెలిపారు. నంద్యాల వైపు నుంచి కర్నూలు వైపునకు వచ్చే వాహనాలను మాత్రమే దారి మళ్లిస్తున్నామని చెప్పారు. ఇతర జిల్లాల నుంచి కర్నూలుకు వచ్చేవారు ట్రాఫిక్ మళ్లింపు ఉంటుందనే విషయాన్ని గమనించి పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. అడ్మిన్ అడిషనల్ ఎస్పీ నాగరాజు, కర్నూలు డీఎస్పీ విజయశేఖర్, స్పెషల్ బ్రాంచ్ సీఐ నాగరాజు యాదవ్, కర్నూలు అర్బన్ తాలూకా సీఐ శ్రీధర్, ట్రాఫిక్ సీఐ గౌతమి తదితరులు ఎస్పీ వెంట ఉన్నారు.

### రూ.1.5 లక్షల జరిమానా

కర్నూలు (న్యూటౌన్): ఎమ్మిగనూరు నియోజకవర్గం నందవరంలో మే 27వ తేదీ అక్రమంగా గ్రావెల్ తవ్వి తరలించిన 8 ట్రాక్టర్లు, ఒక జేసీబీని రెవెన్యూ సిబ్బంది సీజ్ చేసిన విషయం తెలిసిందే. వాటిని గనులశాఖకు అప్పగించారు. శనివారం గనులశాఖ అధికారులు ఒక్కో ట్రాక్టర్‌కు రూ.10 వేల చొప్పున రూ.80 వేలు, జేసీబీకి రూ.25 వేలు మొత్తం రూ.1.5 లక్షలు జరిమానా వసూలు చేసి ట్రాక్టర్లను, జేసీబీని విడుదల చేసినట్లు జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ టి.రాజశేఖర్ తెలిపారు.

## శుద్ధజలం అందించడమే లక్ష్యం


కుళాయి నీటి నమూనాలను పరీక్షిస్తున్న డీఈఈ గోపాలకృష్ణ

కర్నూలు (టౌన్) : నగరవాసులకు శుద్ధజలం అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు నగరపాలక కమిషనర్ భార్గవతేజ అన్నారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో అతిసారం ప్రబలుతున్న నేపథ్యంలో శనివారం నగరపాలక సంస్థ పరిధిలోని 135 సచివాలయాల పరిధిలో తాగునీటి శాంపుల్స్ సేకరించారు. కమిషనర్ మాట్లాడుతూ వార్డు సచివాలయ ఎనిమిటీ కార్యదర్శులు క్షుణ్ణంగా నీటి పరీక్షలు చేయాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో మంచినీటి సరఫరాపై ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు. సచివాలయ ఉద్యోగులు చేసే నీటి నమూనా పరీక్షలను ఇంజినీరింగ్ సిబ్బంది తనిఖీ చేయాలన్నారు. క్లోరినేషన్ శాతాన్ని, అలాగే నీటి నాణ్యతపై ఏవైనా సందేహాలు వస్తే నీటి నమూనాలను హెడ్ వాటర్ వర్క్స్‌లోని ప్రత్యేక ల్యాబ్‌కు పంపించాలని ఆదేశించారు.

## స్ట్రాంగ్‌రూమ్‌లను పరిశీలించిన జేసీ


స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలిస్తున్న జేసీ నారపురెడ్డి మౌర్య

కర్నూలు(సెంట్రల్): రాయలసీమ యూనివర్సిటీలో భద్రపరచిన పాణ్యం అసెంబ్లీ ఎన్నికల ఈవీఎంల స్ట్రాంగ్ రూమ్‌లను ఆ నియోజకవర్గ ఆర్వో/ జేసీ నారపురెడ్డి పరిశీలించారు. శనివారం ఆమె కమ్యూనికేషన్ సెంటర్‌లో స్ట్రాంగ్ రూమ్‌ల లైవ్‌ఫీడ్‌ను పరిశీలించి సంతకం చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. పాణ్యం అసెంబ్లీ నియోజకవర్గం, అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని నంద్యాల ఎంపీ స్థానం ఫలితాల ప్రకటన కోసం పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. జూన్ 4వ తేదీన చేపట్టే కౌంటింగ్ కోసం దాదాపు 200 మంది సిబ్బందిని నియమించామని, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. మొదట కల్లూరులో ఓట్ల లెక్కింపు ప్రారంభమై చివరిగా గడివేముల మండలం ఎస్.కొత్తూరు పోలింగ్ కేంద్రంతో పూర్తవుతుందని వివరించారు.

### విజయోత్సవ సంబరాలు నిషేధం

గూడూరు: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఈ నెల 4న ఓట్ల లెక్కింపు అనంతరం విజయోత్సవ సంబరాలు నిషేధమని కర్నూలు రూరల్ సీఐ కిరణ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని కే నాగులాపురం పోలీస్ స్టేషన్‌లో వివిధ రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలతో శనివారం ఎస్‌ఐ ఏపీ శ్రీనివాసులుతో కలిసి ఆయన సమావేశమయ్యారు. సీఐ మాట్లాడుతూ జూన్ 6 వరకు ఎన్నికల కోడ్ ఉన్నందున ప్రతిఒక్కరూ పాటించాలని సూచించారు. కోడ్ ఉల్లంఘించిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. విజయోత్సవ సంబరాలు, ర్యాలీలు, బాణాసంచా కాల్చడం తదితర వేడుకలు నిషిద్ధమన్నారు.

### రగ్బీలో కర్నూలుకు రజత పతకం

కర్నూలు (టౌన్) : భీమిలీ పట్టణంలోని విజ్ఞాన్ ఇంటర్నేషనల్ స్కూల్ క్రీడా మైదానంలో శనివారం నిర్వహించిన 9వ రాష్ట్రస్థాయి రగ్బీ ఛాంపియన్‌షిప్ పోటీల్లో కర్నూలు బాలుర జట్టు రజత పతకం సాధించింది. రాష్ట్రస్థాయిలో పతకం సాధించిన బాలుర జట్టుకు ఆంధ్రప్రదేశ్ రగ్బీ ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు, క్రీడా ప్రతినిధులు అభినందనలు తెలియజేశారు.



రజత పతకం సాధించిన కర్నూలు బాలుర జట్టు

## అక్రమ అడ్మిషన్లపై డీఈఓ స్పందించాలి


కేశవరెడ్డి స్కూల్ ఎదుట ఆందోళన చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

కర్నూలు సిటీ: జిల్లాలో కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు విద్యాశాఖ నిబంధనలను ఏ మాత్రం పట్టించుకోకుండా అక్రమంగా అడ్మిషన్లు, ముందస్తు ఫీజులు వసూళ్లు చేస్తున్నారని డీఈఓ వెంటనే స్పందించాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శనివారం ఏఐఎస్‌ఎఫ్, ఏఐఎస్‌ఏ, పీడీఎస్‌యూ సంఘాల ఆధ్వర్యంలో నారాయణ, కేశవరెడ్డి విద్యా సంస్థల వద్ద ఆందోళన చేపట్టారు. వారు మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటికే అనేక విద్యా సంస్థలు విద్యను పూర్తిగా భ్రష్టు పట్టించారని, నారాయణ విద్యా సంస్థల యాజమాన్యం అక్షర జ్ఞానాన్ని అందించే విద్యాలయాలు విక్రయశాలలుగా మార్చారన్నారు. అదే విధంగా కేశవరెడ్డి విద్యా సంస్థల్లోనూ నిబంధనలను ఏ మాత్రం పాటించకుండా పాఠ్యపుస్తకాలు, ముందస్తు ఫీజులు వసూళ్లు చేస్తున్నారని, తల్లిదండ్రులకు ఫోన్లు చేసి మరీ ఒత్తిడి చేస్తున్నారని చెప్పారు. విద్యార్థి సంఘాలు ఆందోళనలు చేస్తూ, జిల్లా విద్యాశాఖ అధికారులు, మండల స్థాయి అధికారుల దృష్టికి తీసుకపోతున్నా ఏ ఒక్క అధికారి కూడా స్పందించడం లేదని, దీని బట్టి చూస్తే విద్యాశాఖ అధికారులు ఏ మేరకు పని చేస్తున్నారో అర్థం చేసుకోవచ్చునని అన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్‌ఏ రాష్ట్ర కార్యదర్శి నాగరాజు, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సోమన్న, పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు రమణ, నగర అధ్యక్షుడు దామోదర్, ఏఐఎస్‌ఏ నగర కార్యదర్శి నాని, ఏఐఎస్‌ఎఫ్ నగర నాయకులు అజయ్, అభి, ఉదయ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## గర్భిణులు, పిల్లలకు సకాలంలో టీకాలు ఇవ్వాలి

● డీఎంహెచ్‌ఓ డాక్టర్ ప్రవీణ్‌కుమార్

కల్లూరు: గర్భిణులు, పిల్లలకు సకాలంలో టీకాలు అందించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి (డీఎంహెచ్‌ఓ ) డాక్టర్ ప్రవీణ్‌కుమార్ ఆదేశించారు. శనివారం కల్లూరు అర్బన్ లక్ష్మీపురం పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, అంగన్‌వాడీ కేంద్రంలో జరుగుచున్న వ్యాధినిరోధక టీకాల కార్యక్రమాన్ని డీఎంహెచ్‌ఓ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఆరోగ్య కార్యకర్త శిశువులుకు, గర్భిణులకు నిర్దేశించిన సమయానికి సరైన మోతాదులో వ్యాధి నిరోధక టీకాలను వేయాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు, గర్భిణులకు ఇస్తున్న ఐరన్ మాత్రల పంపిణీ, పోషకాహారం వివరాలను అడిగి తెలుసుకున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే గర్భిణులకు మధ్యాహ్నం భోజన సమయంలో ఐరన్ మాత్రలు తినిపించాలని సూచించారు. ఐదేళ్లలోపు పిల్లలు తీవ్ర పోషకాహార, అతి తీవ్ర పోషకాహారంలోపం, ఎత్తుకు తగ్గ బరువు లేకపోవడం, రక్తహీనత, న్యూమోనియో లాంటి సమస్యలుంటే ప్రభుత్వ ఆస్పత్రిలోని ఎన్‌ఆర్‌సీ కేంద్రానికి తరలించాలన్నారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్లు, ఎఎన్‌ఎమ్‌లు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.